క్లుప్తంగా

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి


బేపారి మహమ్మద్‌ఖాన్

రాయచోటి అర్బన్ : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై దాడి చేసి హత మార్చిన ఉగ్రవాదులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని వైఎస్‌ఆర్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పహల్గామ్ దాడిలో ఉగ్రవాదులు 28 మంది అమాయక పర్యాటకులను పొట్టనపెట్టుకోవడం దుర్మార్గమన్నారు. దాడిలో మృతిచెందిన వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలంటూ ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. మరోమారు ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా కేంద్ర ప్రభుత్వం భద్రతా చర్యలు చేపట్టాలంటూ కోరారు.

సీతారాములను దర్శించుకున్న ఆకేపాటి

చిట్వేలి : చిట్వేలి గాజుల వీధిలో నూతనంగా ప్రతిష్టించిన సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలను గురువారం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రమణారెడ్డి, మలిశెట్టి వెంకటరమణ, మధు, నవీన్, వినయ్, ఆకాష్, హజరత్ రెడ్డి, మణి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమంపై దృష్టి


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

చిట్వేలి : మండల పరిధిలోని కె.కందులవారిపల్లిలో రూ. 3.50 కోట్లతో సబ్ స్టేషన్ నిర్మాణానికి గురువారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డిలు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్, మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తోందన్నారు.

ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం

సంబేపల్లె : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ రాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం పండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది సమీపంలోని జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో గంగ జాతర

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని శివశం కరపురం గ్రామంలో గురువారం బలిజపల్లె గంగమ్మ ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా జాతరను నిర్వహించారు. పునఃప్రతిష్ట సందర్భంగా మూడు రోజుల నుంచి అమ్మవారికి అభిషేకాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. గురువారం గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి పొంగుబాళ్లు సమర్పించి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. ఇతర ప్రాంతాల నుంచి బంధువులు స్నేహితులు జాతర సందర్భంగా గ్రామానికి రావడంతో సందడి వాతావరణం కనిపించింది. ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా వరలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పారిశుధ్య చర్యలలో రాజీపడేదిలేదు

రాజంపేట : పట్టణంలో పారిశుధ్య చర్యలలో రాజీపడేదిలేదని రాజంపేట మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం వార్డు సచివాలయాల శానిటరీ విభాగం సిబ్బందితో తొలిసారిగా తన చాంబరులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట మున్సిపాలిటి పారిశుధ్యం అధ్వానంగా తయారైందన్నారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు తాను ప్రత్యేక దృష్టి సారించానన్నారు. చెత్త సేకరణ పక్కాగా జరగాలన్నారు. పారిశుధ్య విభాగానికి సంబంధించి వారికి కేటాయించిన విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రోడ్లపైన వ్యాపారులు, ప్రజలు ఇష్టానుసారంగా వేసే విషయంలో మున్సిపాలిటీ సూచించిన నియమాలు పాటించాలన్నారు. ఉదయాన్ని పట్టణంలో పారిశుధ్య పనులను కమిషనర్ కలియతిరిగి పరిశీలించారు. అనంతరం ఆయన రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి, ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డేలను వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు.

వేడుకగా రాములోరి కల్యాణం

నందలూరు : మండలంలోని నల్ల తిమ్మయ్య గారిపల్లి గ్రామంలో రాములవారి దేవస్థానం వద్ద గురువారం శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. జెడ్పీటీసీ గడికోట ఉషారాణి, గడికోట సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ కల్యాణం జరిగింది. అనంతరం వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదాన ప్రసాదాలను అందజేశారు.

పారుతున్న నిర్లక్ష్యం.. పడకేసిన పారిశుధ్యం

కంపు కొడుతున్న మంత్రి మండిపల్లి సొంత నియోజకవర్గ కేంద్రం

- చెత్త కదలదు.. మురుగు పారడం లేదంటున్న ప్రజలు
- అధికార పార్టీ నాయకుల మెప్పుపొందేందుకే అధికారుల మొగ్గు
- పాలకవర్గం ఆదేశాలు పట్టించుకోని వైనం
- దోమల బెడదతో ప్రబలుతున్న వ్యాధులు


9వ వార్డులో ఇళ్ల మధ్య చెత్తను తొలగించకపోవడంతో డంపింగ్ యార్డుగా మారిన దృశ్యం

రాయచోటి : పన్నుల వసూళ్లపై చూపుతున్న శ్రద్ధ పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పనలో మున్సిపల్ అధికారులు చూపడం లేదు. పాలనను చూడాల్సిన మున్సిపల్ పాలకవర్గం.. అధికార పార్టీ నాయకుల మధ్య ఉన్న రాజకీయ వైరాన్ని మున్సిపల్ శాఖ అధికారులు వారికి ఇష్టం వచ్చిన రీతిలో సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మున్సిపల్ పాలక పక్షాన్ని పక్కన పెట్టి అధికార పార్టీ నాయకులకు అధికారులు జై కొడుతున్నారు. ప్రజల బాగోగులను గాలికి వదిలి అధికార పార్టీ నాయకుల సేవల్లో మునిగి తేలుతున్నారు. ఫలితంగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం నిల్వలు దర్శనమిస్తున్నాయి. మురుగునీరు పారాల్సిన కాలువల నిండా చెత్త పేరుకుపోయింది. వాటి నుంచి వెలువడుతున్న దుర్గంధభరిత వాసనలు ముక్కుపుటలు అదిరిపోతున్నాయి. నివాసాల మధ్యనే పేరుకుపోయిన చెత్తాచెదారం, రోడ్లపై పారుతున్న మురుగునీటితో దోమలకు ఆవాసాలుగా మారాయి. దోమల దండయాత్రతో జనాలు విషజ్వరాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ వేలకు వేల రూపాయలు ఖర్చు చేసుకుంటూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

రోడ్లపైకి చేరుతున్న చెత్తాచెదారం

ప్రజలలో అవగాహన కొరవడంతో పాటు అధికారుల నిర్లక్ష్యంతో రోడ్లపైన చెత్త దర్శనమిస్తున్నది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుబాటులో ఉన్న కార్మికులతో పరకబట్టి ఊడ్చనివ్వరు, పారబట్టి కాలువలలో మట్టి తియ్యకపోవడంతో పట్టణంలోని రోడ్లన్ని దుమ్ము కొట్టుకుపోయాయి. గాలి దుమారంతో చెత్తాచెదారం రోడ్లపైకి వచ్చి చేరుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై పారేసిన చెత్త, కాలువలలో పారాల్సిన మురుగు ముందుకు పారలేక రోడ్డెక్కి జనాన్ని వెక్కిరిస్తోంది. కుళ్లిన చెత్త నుంచి దుర్గంధం వెదజల్లుతుండటంతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని ప్రజలు వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాటు ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడంలో విఫలమయ్యారన్న విమర్శలున్నాయి.

శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌ను పక్కన పెట్టి..

రాయచోటి మున్సిపాలిటీలో శానిటేషన్ మేనేజర్ ఉన్నా అధికారాన్ని అడ్డుపెట్టుకుని జూనియర్లకు, సచివాలయం సెక్రటరీలకు శానిటేషన్ పర్యవేక్షణ బాధ్యతలు ఇవ్వడం మరో విశేషం. ఇన్‌చార్జ్‌లుగా సాగుతున్న సిబ్బంది వారి ఆదాయంపై శ్రద్ధ చూపుతూ పారిశుధ్యాన్ని గాలికి వదిలేశారు. దీంతో అక్కడక్కడా ప్రధాన వీధుల్లో చెత్తను తొలగిస్తున్నప్పటికీ చాలా ప్రాంతాలలో రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోయి డంప్‌ను తలపిస్తోంది.

పేరుకే జిల్లా కేంద్రం.. పరిస్థితి అధ్వానం

కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాయచోటి పట్టణం పారిశుధ్య లోపంతో కొట్టుమిట్టాడుతోంది. గత ప్రభుత్వంలో జిల్లా కేంద్రంగా రూపాంతరం చెంది రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులతో పరుగులు తీసింది. కూటమి పాలన ప్రారంభమైన నాటి నుంచి రాయచోటికి గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. నేడు మున్సిపాలిటీ పరిధిలో ఎటు చూసినా ఏమున్నది గర్వకారణం.. రోడ్లపై పారుతున్న మురుగునీరు.. వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం.. పందుల స్వైర విహారం.. ప్రజలపై దోమల దండయాత్ర తప్ప.. ఏ మూల చూసినా విషజ్వర పీడితులే కనిపిస్తారు. అభివృద్ధిలో పల్లెలకు ఆదర్శంగా నిలవాల్సిన పట్టణాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. పచ్చదనంతో ఆహ్లాదంగా ఉండాల్సిన పురవీధులు చెత్తకుప్పలతో స్వాగతాలు పలుకుతున్నాయి. పూడిక కారణంగా మురుగు కాలువలలో మురుగునీరు ముందుకు కదలడం లేదు. చెత్తకుండీలో ఉండాల్సిన వ్యర్థాలు రోడ్లపైనే దర్శనమిస్తున్నాయి. ఫలితంగా దోమలు వృద్ధి చెంది ప్రజలు డెంగీ, మలేరియా వంటి విషజ్వరాల బారిన పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో 50 శాతం మందికి పైగా విషజ్వరాల బాధితులే కనిపిస్తున్నారు. లక్షల రూపాయలకు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేసినట్లు రికార్డులు చెబుతున్నా వినియోగించిన దాఖలాలు అరకొరేనన్న ఆరోపణలు ఉన్నాయి.

మంత్రి ఇలాఖాలో..

రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రాతినిత్యం వహిస్తున్న రాయచోటి పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. జిల్లా కేంద్రమైన రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య పనులు ముందుకు సాగక ఎక్కడ పడితే అక్కడ మురుగునీటిలో చెత్త కలిసి కంపు కొడుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో మురుగునీరు రోడ్ల మీదకు వచ్చి ముక్కుపుటలు దుర్వాసనను వెదజల్లుతూ పాదచారులకు నడవలేని స్థితిలో నరకాన్ని చూపిస్తున్నాయి. రాష్ట్ర మంత్రి సొంత నియోజకవర్గ కేంద్రంలో ఈ దుస్థితి నెలకొనడం గమనార్హం. పట్టణంలోని ఏ వీధికి వెళ్లి మురుగునీటి కాలువను పరిశీలించినా దుర్గంధపు భరితంగా మారిన కాలువలు దర్శనమిస్తాయి.

ఇలా ఉంటే నీరు పారేదెలా..

మున్సిపాలిటీ పరిధిలో ఏటా లక్షలాది రూపాయలు పారిశుధ్యం కోసం ఖర్చు చేస్తున్నారు. ప్రతిరోజు పట్టణంలో టన్నుల కొలది చెత్త పోగవుతోంది. ఏజెన్సీ ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెత్త సేకరణ ఆటోలకు బిల్లులు చెల్లించకపోవడంతో 24 ఆటోలు వెనక్కు వెళ్లిపోయాయి. వీటి కొరత కూడా చెత్త నిల్వకు ఒక కారణంగా చెబుతారు. ప్రస్తుతం 6 ఆటోల ద్వారా ఇంటింటా చెత్తను సేకరిస్తున్నారు. 11 ట్రాక్టర్లు, మూడు లారీలు ఉన్నాయి. ఉన్న కార్మికులతో పాటు అదనంగా 60 మంది అవసరం ఉంటుంది. ఫాగింగ్ యంత్రాలు బాగున్నా వినియోగించరు. వీధుల్లోని మురుగు పట్టణ వెలుపలికి వెళ్లాలంటే నిర్మించిన కాలువల్లో పారపట్టి చెత్తను బయటకు తీసిన పాపాన పోలేదు. ఎక్కడికక్కడ చెత్తా చెదారము, మురుగు కలిసి నిల్వ ఉండటంతో దోమలకు ఆవాసాలుగా మారాయి.

బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదు

రాయచోటి మున్సిపాలిటీలో దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్‌ను లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. అయితే కొనుగోలు చేసిన బ్లీచింగ్ పౌడర్‌ను చల్లడం కంటే సంబంధిత అధికారులు రికార్డుల్లో లెక్కల రూపంలో తినేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం 250 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. అదనంగా మరో 60 మంది సిబ్బంది నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కాలువలలో రెగ్యులర్‌గా చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో దోమల బెడద అధికమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు పట్టణ పరిధిలో 4 వేల మందికి పైగా జ్వర బాధితులు నమోదు కావడం గమనార్హం.


పట్టణంలోని ఫైర్ స్టేషన్, షాదీ మహల్ సమీపంలోని ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్త

పట్టపగలే దోమల దండయాత్ర

పట్టణాలలో దోమల బెడద పెరిగింది. ప్రజారోగ్య విభాగం దోమల నివారణకు చర్యలు తీసుకోకపోగా చేతులెత్తేశారు. దోమల నివారణకు చర్యలు చేసినట్లు రికార్డులు సృష్టించి లక్షలకు లక్షల రూపాయల బిల్లులు దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫాగింగ్ యంత్రాలు మూలనపడ్డాయి. గతంలో లార్వాను తినే గంబూజీ చేపలను విరివిగా వదిలేవారు. ఇప్పుడు వాటి ఊసే లేదు. కుప్పలు తెప్పలుగా పుట్టుకొచ్చిన దోమలు పగలే ప్రజలపై దండయాత్రలు చేసి కుట్టేస్తున్నాయి. రాత్రివేళల్లో నిద్రపోనివ్వడం లేదు. వాటి కాటుతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి.

దుర్వాసనతో ప్రాణం పోయేలా ఉంది



కాలువల్లో పేరుకుపోయిన చెత్త నుంచి వస్తున్న వాసనను పీల్చి మనుషులు చచ్చిపోవాల్సి వస్తోంది. బస్టాండు రోడ్డులోని నేతాజీ సర్కిల్ వరకు ఉన్న మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి కొన్ని నెలలు అవుతుంది. మున్సిపల్ సిబ్బంది చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. సాయంత్రం వేళ మనిషి నిలబడితే దోమలు చుట్టుముట్టి రక్తాలు పీలుస్తున్నాయి. వివిధ పనుల నిమిత్తం ఈ ప్రాంతానికి వచ్చే ప్రజలు ఈ వాసనను భరించలేక వెళ్లిపోతున్నారు.

– ఖాదర్‌వలీ, రాయచోటి పట్టణం

చెత్త తొలగింపులో శ్రద్ధ చూపడం లేదు



రాయచోటిలో మున్సిపల్ అధికారులు పన్ను వసూళ్లపై చూపే శ్రద్ధ.. పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపులో చూపడం లేదు. పన్ను చెల్లింపు ఆలస్యమైతే అదనపు రుసుముతో చెల్లించాలని చెప్పే మున్సిపల్ అధికారులకు పేరుకుపోయిన చెత్తను తొలగించకపోతే ఎలాంటి చర్యలు తీసుకోవాలో వారే చెప్పాలి. నెలలు గడుస్తున్నా కాలువల్లో చెత్తను మాత్రం తొలగించడం లేదు. ఎప్పుడు చెత్త తొలగిస్తారో తెలియడంలేదు. పారిశుధ్య పనులు చేపట్టి ప్రజారోగ్యానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

– జనార్దన్‌రెడ్డి, ఎన్‌జీఓ కాలనీ, రాయచోటి

వైభవంగా గంగమ్మ జాతర


గంగమ్మను దర్శించుకుంటున్న ఆకేపాటి, పోలా


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

రాజంపేట టౌన్ : పట్టణంలోని మన్నూరులో గురువారం గంగమ్మ జాతరను నిర్వాహకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువ జామున అమ్మవారిని భక్తులు ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేకంగా తయారు చేసిన వేపమండల గుడిలో కొలువుదీర్చారు. అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చే సమయంలో భక్తులు గంగమ్మకు ఇష్టమైన నైవేద్యాలను ఎదురుగుంభంగా సమర్పించారు. అమ్మవారు గుడిలోకి వచ్చే సమయంలో భక్తులు పోతురాజును ఊరేగించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు పోతురాజును ఊరేగించేందుకు పోటీపడ్డారు. అలాగే పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. గంగమ్మ గుడిలోకి చేరుకోగానే జాతర ఒక్కసారిగా ఊపందుకుంది. గుడిలో కొలువుదీరిన గంగమ్మను భక్తులు దర్శించుకొని గంగమ్మా.. కాపాడమ్మా అంటూ వరపడ్డారు. రాత్రి పొద్దు పోయే వరకు భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి గంగమ్మను దర్శించుకున్నారు. పలువురు భక్తులు, స్వచ్ఛంద సంస్థలు మంచినీరు, మజ్జిగ, భోజనాన్ని భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. జాతర సందర్భంగా గంగమ్మను ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకున్నారు. ప్రతి ఏడాది మన్నూరులో ఎంతో వైభవంగా జరిగే జాతరలో తాము పాల్గొని అమ్మవారిని దర్శించుకునే భాగ్యం కలుగుతుండటం తమ పూర్వజన్మ సుకృతమన్నారు.

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : అధికారులు, ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మండల అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యునిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండిపల్లి మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో ఎంతో మంది పేదులకు ఉపాధి లభిస్తోందని, ఇలాంటి పథకాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఎంపీడీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు బాగా పనిచేయాలన్నారు. ఉపాధి పథకంలో పని చేసేవారు అవకతవకలకు పాల్పడినట్లైతే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామాలలో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యను ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి పనులు చేపట్టడం లేదని సభ్యులు ఆరోపించారు. వ్యవసాయ బోర్లకు కనెక్షన్‌లు ఇవ్వాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. అకాల వర్షానికి నష్టపోయిన రైతులను పట్టించుకుని మామిడి రైతులను ఆదుకోవాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఉషారాణి, కో–ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి హేయమైన చర్య


రాయచోటి అర్బన్: నేతాజీ సర్కిల్‌లో..


చిట్వేలి: మానవత ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ


సుండుపల్లె: కొవ్వొత్తులతో మానవహారం


రైల్వేకోడూరు అర్బన్: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో..

రాయచోటి అర్బన్/సుండుపల్లె/రైల్వేకోడూరు అర్బన్ : పహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, మైనార్టీల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీలు తీశారు. గురువారం సుండుపల్లె, రాయచోటి పట్టణంలో జరిగిన ర్యాలీలో ప్రాణాలు కోల్పోయిన వారికి కొవ్వొత్తులతో పాల్గొని తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఉగ్రవాదులను ఊచకోత కోయాలని డిమాండ్ చేశారు. దేశ సమగ్రత, సౌభ్రాతృత్వాన్ని దెబ్బతీసే శక్తులను ఏరివేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మృతి చెందిన పర్యాటకులకు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో ప్రజాసంఘాలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

సిద్దవటం : మండలంలో సొంత భూమి కలిగిన ప్రతి రైతు ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకొని విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లె, టక్కోలు రైతుసేవా కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 534 మట్టి నమూనాలను సేకరించడం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 100కు పైగా సేకరించామన్నారు. మిగిలిన లక్ష్యాన్ని ఈనెల 30వ తేదీ లోపు పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించామన్నారు.

ఉచిత సీటు కోసం దరఖాస్తు చేసుకోవాలి


రాజంపేట టౌన్ : ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఒకటవ తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలని ఎంఈఓ కొండూరు రఘునాథ్‌రాజు తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయ సభా భవనంలో గురువారం పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థులు ఉచిత సీటు కోసం ఈనెల 28వ తేదీ నుంచి మే 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు అవసరమైన ధృవపత్రాలను జతచేయాలని చెప్పారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వీరబల్లి : మండలంలోని మట్లి గ్రామ పంచాయతీ మాండవ్య నది ఒడ్డున వెలసిన శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో గత వారం రోజుల నుంచి మహాభారత యజ్ఞం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సీతారాముల కల్యాణోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరిపారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి ప్రజలు తరలివచ్చారు. అలాగే మహాభారత యజ్ఞంలో భాగంగా హరికథ భాగవతాన్ని సీతామహాలక్ష్మి పాండవ వనవాసం హరికథను వినిపించారు.

పొలానికి దారి సమస్య పరిష్కరించండి

రామాపురం : మండలంలోని రాచపల్లి గ్రామంలో రైతులు పొలానికి దారి సమస్య పరిష్కరించని అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు మండల రెవెన్యూ అధికారికి సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి వినతిపత్రాన్ని అందించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రాచపల్లి గ్రామం సర్వేనెంబరు 19/10లో ఎద్దుల మల్లయ్య, పలువురు రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా రోడ్డుకు మొదటి వరుసలోని జబ్బార్ బాషాకు చెందిన డీకేటీ భూమి గుండా దారిలో ఇతర రైతులు తమ పొలాలకు వెళ్తుండేవారన్నారు. జబ్బార్‌బాషా నుంచి డీకేటీ భూమిని కొనుగోలు చేసిన పుల్లగూర రవిశంకర్ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి రైతులకు దారి లేకుండా చేశారన్నారు. ఈ విషయాన్ని రైతులు అనేక పర్యాయాలు రెవెన్యూ అధికారులకు విన్నవించినప్పటికి పట్టించుకోలేదన్నారు. డీకేటీ భూముల క్రయ విక్రయాలు నేరమని, పైగా పొలంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన వీఆర్ఓ, సర్వేయర్‌లు స్పందించలేదని ఆరోపించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యను అధికారులు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలియజేశారు. ఆయనతో పాటు సీపీఎం శాఖ కార్యదర్శి నాగబసిరెడ్డి, ఈశ్వరయ్య, రైతులు నాగరాజు, మల్లయ్య, నారాయణలు పలువురు రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో కీలకం పంచాయతీ రాజ్ వ్యవస్థ


ఒంటిమిట్ట: గ్రీన్ అంబాసిడర్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ జిల్లా ఇన్‌చార్జ్ డీపీఓ

ఒంటిమిట్ట/సుండుపల్లె/చిన్నమండెం/సిద్దవటం : జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఆయా మండల కేంద్రాల్లో ఎంపీడీఓలు, పంచాయతీ రాజ్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఒంటిమిట్టలో జరిగిన గ్రామసభకు ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జ్ పంచాయతీ అధికారి సయ్యద్ ఖాదర్ బాషా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వ్యవస్థ 1992 73వ రాజ్యాంగ చట్ట సవరణ చేసి, 1993 ఏప్రిల్ 24న అమలులోకి వచ్చిందన్నారు. 2010 ఏప్రిల్ 24న పంచాయతీరాజ్ దినోత్సవాన్ని అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ ప్రారంభించారన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి అన్ని సౌకర్యాలు గ్రామ పంచాయతీ ద్వారా కల్పించారన్నారు. అనంతరం ఈ వేడుకలలో గ్రీన్ అంబాసిడర్లను శాలువాలతో సత్కరించి వారికి పప్పు, ఉప్పు, చక్కెర, కాయగూరలు వంటివి ఒక్కొక్కరికి రూ.1000లు విలువచేసే వస్తువులను జిల్లా ఇన్‌చార్జ్ పంచాయతీ అధికారి, ఉప సర్పంచ్ చేతులమీదుగా అందజేశారు. ఆయా కార్యక్రమాలలో ఎంపీడీఓలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, గ్రీన్ అంబాసిడర్స్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయండి

పుల్లంపేట : నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని గురువారం సీపీఐ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో నిరుపేదలు చాలా మంది ఉన్నారని, రెవెన్యూ అధికారులకు గత రెండు నెలల క్రితం పేదల వివరాలను అందించామన్నారు. ఇంతవరకు చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా స్పందించి లబ్ధిదారులను గుర్తించి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.